# 'ఆరోగ్యశ్రీ'ని వినియోగించుకోవాలి

కె.పి.హెచ్.బి.కాలనీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

పేద ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టిందని ఖైరతాబాద్ శాసనసభ్యులు పి.జనార్దన రెడ్డి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని విధంగా ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను, ప్రాజెక్టులను సోనియాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. బాలానగర్ మండల కార్యాలయం ఆవరణలో గురువారం సాయంత్రం జరిగిన రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ కలెక్టర్ కె.యాదగిరిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పిజెఆర్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని మరచి హైటెక్ హంగుల కోసం పాకులాడాయని ఎద్దేవా చేశారు. లక్షలాది రూపాయలను వెచ్చించి కార్పొరేట్ వైద్యాన్ని పొందలేని పేద ప్రజలందరికి తోడ్పాటును అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టిందని తెలిపారు. తెలుపు రేషన్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం మండల డిప్యూటీ కలెక్టర్ యాదగిరిరెడ్డి, సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో తెలుపు రేషన్‌కార్డులు కలిగిన ప్రతి కుటుంబం ఆరోగ్యశ్రీ పథకానికి అర్హులని, వారందరికీ ఇంటింటికి కార్డులను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్క పెంటయ్య, మాజీ అధ్యక్షుడు బండారి ప్రకాష్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు పార్వతిదేవి, బసిరెడ్డి బ్రహ్మానందరెడ్డి, రాజశేఖర్‌నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, శేరిరెడ్డి సతీష్‌రెడ్డి, శివారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సంజీవ, ఎల్లారావు, వి.చంద్రారెడ్డి, వీరాస్వామి, ఖదిర్, విఠల్, మహిళా నాయకురాళ్లు సుగుణ ఆచార్య, ప్రభావతి పాటు పలువురు పాల్గొన్నారు.



రాజీవ్ ఆరోగ్యశ్రీ అవగాహన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న పిజెఆర్

## దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవు

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో లబ్ధిదారులు తమ ప్రయోజనాలకు ఏ మాత్రం భంగం కలగకుండా వ్యవహరించాలని, అదేవిధంగా లబ్ధిదారులకు సహకరించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్యమిత్ర సిబ్బంది స్వార్థపూరితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పిజెఆర్ హెచ్చరించారు. ప్రధానంగా కార్డుల పంపిణీ సమయంలో డబ్బులు వసూళ్లు చేయడం, ఆరోగ్య సేవల కోసం ఆసుపత్రికి వెళ్లే సమయంలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయడం వంటివి తమ దృష్టికి తీసుకువస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని పిజెఆర్ తెలిపారు. సమావేశం ముగిసిన తరువాత పలువురు మహిళలు, నాయకులు కార్డుల జారీ సమయంలో రేషన్‌షాపు నిర్వాహకులు ఒక్కొక్క కార్డుకు వంద రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో పిజెఆర్ ఎమ్ఆర్ఓను మందలించారు. డబ్బులు వసూలు చేస్తున్న రేషన్ షాపుల నిర్వాహకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఇంటింటికి తిరిగి కార్డులను జారీ చేసేందుకు రెవెన్యూ, మున్సిపల్, ఇందిరమ్మ వార్డు కమిటీల సభ్యులను తీసుకు వెళ్ళాలని సూచించారు.

# గోకుల్ వివాదంపై టిడిపి మొసలికన్నీరు

## శాసనసభ్యుడు పి.జనార్దన్‌రెడ్డి

కె.పి.హెచ్.బి.కాలనీ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

దశాబ్ద కాలానికి పైగా కొనసాగుతున్న గోకుల్‌ప్లాట్స్ వివాదాన్ని ఏనాడూ పట్టించుకోని తెలుగుదేశం పార్టీ నేడు బాధితులను పరామర్శించే నెపంతో మొసలికన్నీరు కార్చడం సిగ్గుచేటని ఖైరతాబాద్ శాసన సభ్యులు పి.జనార్దనరెడ్డి విమర్శించారు. బాలానగర్ మండల కార్యాలయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పిజెఆర్ గోకుల్ ప్లాట్స్ వివాదంపై స్పందించారు. తొమ్మిది సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్న చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి విజయరామారావులు గోకుల్‌ప్లాట్స్ వివాదాన్ని పరిష్కరించేందుకు ఏనాడూ ముందుకురాలేదని, తాను ఎమ్మెల్యేగా లేనప్పటికీ బాధితుల కోసం పాటుపడ్డానని తెలిపారు. ఇటీవల కాలంలో కోర్టు తీర్పు ఆధారంగా జరిగిన ఒప్పందం ప్రకారం ఎన్ఓసిలు పొందినవారు ఇళ్లను నిర్మించుకుంటుండగా ఓర్వలేని మరోవర్గం వారు మాటిమాటికీ మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు అక్కడ చోటుచేసుకుంటున్న ఐదంతస్తుల భవనం విషయమై అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారని,దీంతో అధికారులు కూల్చివేతలు చేపడితే ఆ నెపాన్ని ఇతరులపై నెట్టేందుకు యత్నించడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఆశయాల సాధన కోసం పనిచేస్తోందని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంతో పాటు ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారికి తప్పకుండా క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని తెలిపారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఈ విషయమై హామీనివ్వడం జరిగిందని, గోకుల్‌ప్లాట్స్‌లో కూల్చివేసిన స్థలంలో తిరిగి ఇళ్లను నిర్మించడం జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పేదల ఇళ్ల స్థలాల విషయం పట్టించుకోని చంద్రబాబునాయుడు, నేడు మొసలి కన్నీరు కారుస్తూ బాధితులను పరామర్శించేందుకు రావడం రాజకీయ లబ్ధికోసమేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గోకుల్ వివాదంతో పాటు అడ్డగుట్ట సొసైటీ, వసంత్‌నగర్ వంటి పలు ఇతర వివాదాలను పరిష్కరిస్తామని పిజెఆర్ హామీనిచ్చారు.

# రేపు 'మేకులు కొట్టిన గోడ' పుస్తకావిష్కరణ

కాచిగూడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

కుసుమాంజలి ప్రచురణల సమర్పణలో ప్రముఖ రచయిత తాళ్లూరి లాడన్ బాబు రచించిన 'మేకులు కొట్టిన గోడ' వచన కవితల సంకలనం ఆవిష్కరణ ఈ నెల 8వ తేదీన బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరుగుతుంది. గురువారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ రచయిత తాళ్లూరి లాడన్ బాబు, డాక్టర్ గుండె డప్పు కనకయ్య, ప్రొఫెసర్ ముత్తయ్య, కదిరి కృష్ణ తదితరులు మాట్లాడుతూ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కోనేరు రంగారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మేకులు కొట్టిన గోడ కవితల సంకలన కృతిని స్వీకరిస్తారని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో యస్.వి. విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్, శాసనసభ్యులు డి.యం.వరప్రసాదరావు, ఐఎఎస్ అధికారిణి జి.సువర్ణరాణి, ఐఆర్‌టిఎస్ అధికారి ఎ.భరత్‌భూషణ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి ఆచార్య ననుమాసస్వామి, ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ ద్వా.నా.శాస్త్రి, డాక్టర్ కె.ఆనందన్ తదితరులు పాల్గొంటారని వారు వివరించారు.

# 11న రావు బాలసరస్వతీదేవికి ఘంటసాల స్మారక అవార్డు ప్రదానం

కాచిగూడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధుర గాయకుడు ఘంటసాల 85వ జయంతోత్సవం సందర్భంగా తొలి తెలుగు సినీ నేపథ్య గాయని రావు బాలసరస్వతీదేవికి ఘంటసాల పేరిట బంగారు పతక బహూకరణోత్సవం ఈ నెల 11వ తేదీన శ్రీత్యాగరాయగానసభలో జరుగుతుంది. ఈ మేరకు గురువారం శ్రీత్యాగరాయగానసభలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, ప్రముఖ గాయని కుమారి యం.వి.రమణకుమారి, ప్రధాన కార్యదర్శి యం.వి.సుబ్బలక్ష్మిలు కార్యక్రమ వివరాలు వెల్లడించారు. రావు బాలసరస్వతీదేవికి బంగారు పతక బహుకరణ సందర్భంగా 'హాయమ్మ హాయి' శీర్షికన ఘంటసాల, రావుబాల సరస్వతీదేవిలు పాడిన పాటల సినీ సంగీత విభావరి జరుగుతుందని వారు తెలిపారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసే ఈ కార్యక్రమానికి పార్లమెంట్ మాజీ సభ్యులు పి.వి.రాజేశ్వరరావు అధ్యక్షత వహిస్తారని తెలిపారు. డాక్టర్ కె.వి.కృష్ణకుమారి, ఆలిండియా బ్రహ్మణ ఫెడరేషన్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు నందామోహన్, సీల్‌వెల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.సుబ్బారావు, ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.రావు, శ్రీత్యాగరాయగానసభ అధ్యక్షుడు కళావెంకట దీక్షితులు తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారని వారు తెలిపారు.

కుమారి యం.వి.రమణకుమారి సంగీత సారధ్యంలో జరిగే సినీ సంగీత విభావరిలో ప్రముఖ వర్ధమాన గాయనీగాయకులు పాల్గొంటారని వారు తెలిపారు.

# జీవ ఇంధనాలు వ్యవసాయ నాశన కారకాలు

## జాతీయ స్థాయి సదస్సులో శాస్త్రవేత్తల వెల్లడి

ప్రభాతవార్త, సిటీబ్యూరో:హైదరాబాద్, డిసెంబర్ 6

జీవ ఇంధనాలు ప్రజాహితం కావని, వాతావరణ మార్పులను జీవ ఇంధనాలు సరిచేయలేవని, విషమ మార్పులకు ఆజ్యం పోస్తాయని ఈ నెల 3,4 తేదీల్లో మెదక్ జిల్లా పస్తాపూర్ గ్రామంలో జరిగిన జాతీయ స్థాయి సదస్సులో పలువురు పర్యావరణ వేత్తలు, ప్రజా సంఘాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయబడ్డారు. దేశంలో కొన్ని పరిశీలనలను బట్టి జీవ ఇంధనాలు వ్యవసాయ నాశన కారకాలుగా భావించాల్సి వస్తోందని, కార్ప్‌ప్యూయల్స్ పేరుతో కార్పొరేట్‌ల చేత నడిపించబడుతూ వ్యవసాయ పతనానికి దారితీస్తున్నాయని సదస్సు హెచ్చరించింది. జీవ ఇంధన పంటల సాగు నిజంగా అభివృద్ధికా? వినాశనానికా? అనే అంశంపై సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, అభిప్రాయాలను అందులో పాల్గొన్న హైదరాబాద్ డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ డైరెక్టర్ పి.వి.సతీష్ గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మీడియాకు వెల్లడించారు. సదస్సు తీసుకున్న నిర్ణయాలు, డిమాండ్ల వివరాలు ఇలా ఉన్నాయి.

దేశంలోని గ్రామీణ ప్రజలు, రైతాంగ గిరిజన సమాజాలు ప్రకృతి ఆధారితంగా జీవిస్తున్నారని, తిండి, నీడ, గుడ్డ, ఇంధనం, శక్తి అన్నింటికీ ప్రకృతే ఆధారమని అభిప్రాయబడ్డారు. జీవ వైవిధ్య ఆధారిత మనుగడే ఇంధనానికి మూలమని, అదే నిజమైన, సులభమైన ప్రాకృతిక విధానంగా సదస్సు వ్యక్తం చేసింది. ఇక్కడ ఏకీకృత వ్యవస్థకు మోనోపలికి స్థానం ఉండదని, ఇంధన సామర్థ్యం పెంపు అనే పేరుతో జీవ ఇంధనాన్ని (ఆగ్రోప్యూయల్స్) ప్రోత్సహించడం అనేది ప్రకృతిని నాశనం చేసే మరో విచ్ఛిన్నకర శక్తిగా పేర్కొన్నారు. ఇదే కొనసాగితే సాంప్రదాయక సాగు కొనసాగిస్తున్న రైతులు మానసిక ఒత్తిడులకు గురయ్యే ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని సదస్సు అభిప్రాయపడింది. వాతావరణ మార్పులు ఎందుకొస్తున్నాయో తెలుసుకోకుండా, జీవ ఇంధనం కోసం జెట్రోఫా(అడవి ఆముదం) వంటి పంటలను భారీ ఎత్తున పండించడం వాతావరణ మార్పులను నిరోధించే నిజమైన సమాధానం కాదని స్పష్టం చేసింది. పనికిరాని భూములు అంటూ ఏమీలేవని, పశువుల మేతకు గ్రాసాలు పెంచడానికి, చిన్న అటవీ ప్రాంతాలు, చిన్న సన్నకారు రైతుల భూములు ఉపయోగపడుతున్న విషయాన్ని గుర్తు చేసింది. ఇవి జీవనాధారమే కాకుండా సహజ ప్రకృతికి మూలాధారాలని, వేలాది మంది ప్రజల ప్రయోజనాలను తుంగలో తొక్కి ఆ భూములను ప్రభుత్వం ఇతర కార్పొరేట్ సంస్థలకు కేటాయిస్తుండడంతో వారికి అవి ఇంధనవనరులుగా మారుతున్నాయన్నారు. ఇంధనం, వాయువులు వెలికితీసే విధానం ఇంధన సామర్థ్యంకాదని, ప్రకృతి సహజం కూడా కాదని, జీవ ఇంధన పంటలసాగు జన్యుమార్పిడిద పంటల సాగుకు మరోదారిగా చెప్పారు. కొన్ని దేశాలు, మన దేశంలోని కొన్ని గ్రూపులు దీన్ని వ్యతిరేకించడం జరుగుతోందని పేర్కొన్నారు. వ్యవసాయ నాశన కారకాలుగాఉన్న జీవ ఇంధన పంటలను ప్రోత్సహించే ఎన్ఆర్ఇజిఎ వంటి కార్యక్రమాలను, వీటికై కేటాయించిన ప్రభుత్వనిధులు, పథకాలు, వీటికోసం స్థానికంగా ఉండే గ్రామ పంచాయతీలను, గ్రామ స్థాయి సంస్థలపై ఒత్తిడిని వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వానికి సూచించారు. రవాణాకు సరిపోయే ఇతర మార్గాలు, సరైన పరిశోధనలు, ఇంధన సామర్థ్యం పెంచేవరకు, డిమాండ్ తగ్గేవరకు జీవ ఇంధన తయారీ పథకాల లక్ష్యాలను వెంటనే ఆపాలని కోరారు. ఇంధనం కోసం మన ప్రజలను స్థానభ్రంశం చెందించడం, లేదా ఆహార పంటలసాగు భూమిని, ఈ ఇంధనం పంటల భూములుగా మార్చడం సరికాదని సూచించారు. వాతావరణ మార్పులకు సరైన మూల కారణాలను తెలుసుకుని వాటిని నిరోధించేందుకు గట్టి ప్రయత్నాలు చేయాలని దేశంలోని అన్ని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. జీవనానికి, జీవితాలకై ఇంధన కన్జర్వేషన్ కోసం కృషి చేస్తున్న వ్యక్తుల పనిని గుర్తించి మద్దతు తెలపాల్సిన అవసరం ఉందని సూచించారు.


